# వడగాల్పుల నియంత్రణకు ముందస్తు చర్యలు

- రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- ఉపాధి పనులు, కొనుగోలు కేంద్రాల వద్ద నీడతో పాటు తాగునీటి వసతి కల్పించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల:** వేసవి వడగాల్పుల వల్ల కలిగే నష్టాలను నివారించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు ఆదేశించారు. వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, అటవీ, కార్మిక, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వడగాల్పులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన మరమ్మత్తులు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, బస్టాండ్లు మరియు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వేసవిలో ప్రజలు తరచుగా నీరు తాగడం, బయటకు వెళ్తే గొడుగు వాడడం, తీవ్ర వడగాల్పుల సమయంలో ఇంట్లోనే ఉండడం వంటి జాగ్రత్తలను పాటించాల్సిందిగా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ సదుపాయం కల్పించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, మూగ జీవాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో నీటి తొట్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలలో పశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, వైద్యాధికారి రజిత, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీఆర్డీఓ గీత, మిషన్ భగీరథ అధికారులు అన్వర్, సుమలత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పొద్దుతిరుగుడు సేకరణకు అన్ని ఏర్పాట్లు

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మార్క్ ఫెడ్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల :** పొద్దుతిరుగుడు సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని మార్క్ ఫెడ్ అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పొద్దుతిరుగుడు పంట కొనుగోలుపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మార్క్ ఫెడ్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పొద్దుతిరుగుడు పంట 1,700 ఎకరాల్లో సాగు చేశారని వెల్లడించారు. ఈ పంట కొనుగోలుకు మార్క్ ఫెడ్ ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. కొనుగోలు కోసం కావాల్సిన సామాగ్రి, వేయింగ్ యంత్రాలు అన్ని ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్వింటాల్ పొద్దుతిరుగుడుకు రూ.7721 మద్దతు ధర ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు దీర్ఘకాలం పాటు ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. దీంతో అధిక దిగుబడి, ఆదాయం వస్తుందని తెలిపారు. సన్న వడ్లు పండించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మద్దతు ధర, బోనస్ ఇతర లాభాలను రైతులకు వివరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మార్క్ ఫెడ్ డీఎం హబీబ్, సహకార శాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం, నీటి సరఫరా పకడ్బందీగా ఉండాలి




- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో కీలక సూచనలు
- గ్రీన్ బడ్జెట్‌కు 10శాతం కేటాయింపు
- పన్నుల వసూళ్లు, ప్రజా సేవల మెరుగుదలపై అధికారులకు దిశానిర్దేశం

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా పనులు ప్రతిరోజూ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు సూచించారు. పట్టణాభివృద్ధిలో బడ్జెట్ సమావేశం కీలకమని పేర్కొంటూ, మున్సిపల్ వ్యయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపులు, పారిశుధ్య ఖర్చులు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో కనీసం 10 శాతం గ్రీన్ బడ్జెట్ కింద నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, సంరక్షణకు ఖర్చు చేయాలని ఆదేశించారు. అలాగే మున్సిపల్ బడ్జెట్‌లో 1/3 వంతు నిధులను విలీన గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. మున్సిపల్ కార్మికులందరికీ వెంటనే బీమా కల్పించాలని కమిషనర్‌ను ఆదేశించిన కలెక్టర్, మున్సిపాలిటీకి రావాల్సిన పన్నులను 100 శాతం వసూలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పన్నులు సక్రమంగా వసూలు చేస్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. వార్డు సభ్యులు ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లలో సహకరించాలని కోరారు. అన్ని వ్యాపార సంస్థలు లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ నిధులతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని, పారిశుధ్య పనులు ప్రతిరోజూ పక్కాగా చేయాలని, తడి-పొడి చెత్తను వేరుగా ఇవ్వాలనే అవగాహన కల్పించాలని తెలిపారు. తడి చెత్తను ఎరువుగా తయారు చేసి విక్రయించడం, పొడి చెత్తను అమ్మడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. పార్కులు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్పష్టం చేసిన కలెక్టర్, వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభానికి సిద్ధమవుతోందని, దాని నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డీఆర్‌సీసీ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన మరమ్మత్తులు తక్షణమే పూర్తి చేయాలని వార్డు సభ్యులు, అధికారులకు సూచించారు.

**బడ్జెట్ సారాంశం..**

మున్సిపల్ స్వంత నిధుల ద్వారా అంచనా ఆదాయం రూ. 17.68 కోట్లు కాగా, గ్రాంట్ల ద్వారా రూ. 9.00 కోట్లు రావచ్చని అంచనా. మొత్తం ఆదాయం రూ. 26.68 కోట్లు. గ్రాంట్లతో కలిపి అంచనా వ్యయం రూ. 26.05 కోట్లు ఉండగా, రూ. 0.60 కోట్ల మిగులు ఉండనుంది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా పరిచయం..
# 13 ఏళ్ల బాలికపై అత్యాచారం

**యువకుడిపై పోక్సో కేసు నమోదు, అరెస్ట్**

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఒక దిగ్భ్రాంతికర సంఘటన వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకున్న ఒక యువకుడు 13 ఏళ్ల విద్యార్థినిపై పలుమార్లు అత్యాచారం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు, నిందితుడు కరణ్ కేశి కాగా, బాధితురాలి పేరు మానసి (పేరు మార్చబడింది). ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికతో కరణ్ సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పరచుకుని స్నేహం పెంచుకున్నాడు. అనంతరం పాఠశాల సమీపానికి వచ్చి ఆమెను పాఠశాలకు వెళ్లకుండా ఆపి, హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా ఈ దాడులు కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. మార్చి 27న కూడా బాలికను పాఠశాల గేటు వద్ద నుంచి కారులో ఫ్రెండ్స్ కాలనీలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి, ఆమె ప్రతిఘటించినప్పటికీ అత్యాచారం చేసినట్లు వెల్లడించారు. ఇటీవల బాలిక తరచుగా పాఠశాలకు గైర్హాజరు కావడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులను అప్రమత్తం చేశారు. అనంతరం తల్లిదండ్రులు బాలికను ప్రశ్నించగా, జరిగిన విషయం బయటపడింది. వెంటనే వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే**

**ప్రజానావ, సిరిసిల్ల:** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని 'పోలీస్ యాక్ట్ 1861' ప్రకారం ఏప్రిల్ 1 నుంచి 30 తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని బుధవారం జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించారాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. ఈ విషయంలో జిల్లా ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఎస్పీ సూచించారు.

# విద్యుత్ ఫిర్యాదులకు వాట్సాప్ చాట్‌బాట్ సేవలు ప్రారంభం

**మొబైల్ నుంచే ఫిర్యాదుల నమోదు**

**కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదు**

**త్వరితగతిన పరిష్కారం, పారదర్శకతకు ప్రాధాన్యం: సెస్ ఎండీ భిక్షపతి**

**ప్రజానావ, సిరిసిల్ల:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) అత్యాధునిక సాంకేతికతను వినియోగదారుల ముంగిట్లోకి తీసుకొచ్చిందని సెస్ ఎండీ భిక్షపతి తెలిపారు. ఇకపై వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ మొబైల్ ఫోన్ ద్వారా వాట్సాప్ చాట్‌బాట్ సహాయంతో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**ఫిర్యాదు నమోదు విధానం:**

వినియోగదారులు తమ మొబైల్ నుంచి 7901628348 నంబర్‌కు వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పంపాలి. వెంటనే 'హాయ్.. ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం' అనే సందేశంతో పాటు రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ వంటి ఆప్షన్లు కనిపిస్తాయి. 'రిజిస్టర్ కంప్లైంట్' ఎంపిక చేసిన తరువాత విద్యుత్ కనెక్షన్ వివరాలతో లేదా వివరాలు లేకుండానే ఫిర్యాదు చేయవచ్చు. సర్వీస్ నంబర్ నమోదు చేసిన వెంటనే వినియోగదారుని వివరాలు ప్రత్యక్షమవుతాయి. వాటిని ధ్రువీకరించిన తర్వాత సమస్య రకాన్ని ఎంపిక చేయాలి.

**త్వరిత పరిష్కారం - పారదర్శక సేవలు:**

ఫిర్యాదు నమోదు కాగానే ఒక కంప్లైంట్ ఐడి జనరేట్ అవుతుంది. ఈ సమాచారం వెంటనే సంబంధిత అధికారికి చేరుతుంది. ఫిర్యాదు పరిష్కారం అయిన తరువాత వినియోగదారునికి సందేశంతో పాటు ఐవీఆర్ఎస్ కాల్ కూడా వస్తుంది. ఒకవేళ పరిష్కారంపై సంతృప్తి లేకపోతే, ఫిర్యాదును తిరిగి రీ-ఓపెన్ చేసే అవకాశం లేదా ఫీడ్‌బ్యాక్ ఇచ్చే సౌకర్యం కూడా కల్పించినట్లు ఎండీ తెలిపారు.

**అదనపు సమాచారం:**

వినియోగదారులు ఎన్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ ఉఉఉ.఑ఞడఝజూం.ఛ్రీ.ఉఛీఎలోని వాట్సాప్ ఐకాన్‌పై క్లిక్ చేసి కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించాలని సూచించారు. సాంకేతికతను వినియోగిస్తూ మెరుగైన సేవలు అందించడమే సంస్థ లక్ష్యమని భిక్షపతి స్పష్టం చేశారు.

# మున్సిపల్ మైనార్టీ కోఆప్షన్ (మహిళ) నియామకానికి.. తొలి నామినేషన్



**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ మైనార్టీ కో-ఆప్షన్ మెంబర్(మహిళ) నియామకానికి స్థానిక బీవై నగర్‌కు చెందిన మహమ్మద్ ఆస్మా భర్త షఫీ దరఖాస్తును బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. మంగళవారం కో ఆప్షన్ సభ్యుల నియామకానికి మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా నోటిఫికేషన్ జారీ చేయగా బుధవారం మైనార్టీ విభాగంలో మహిళ అభ్యర్థిగా ఆస్మా తొలి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన అస్మా షఫీ గత మున్సిపల్ పాలకవర్గంలో కూడా కోఆప్షన్ మెంబర్ నియామకానికి దరఖాస్తు చేసుకొని ప్రయత్నాలు చేశారు. అయితే పార్టీ నుంచి ఆశీర్వాదం లభించకపోవడంతో ఆస్మా కో ఆప్షన్ పదవికి దూరమయ్యారు. ఈసారైనా పార్టీ తన సేవలను గుర్తించి అవకాశం ఇస్తుందని ఆస్మా భావిస్తున్నారు.

# ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్
- ప్రభుత్వానికి టీఎన్జీవోల హెచ్చరిక
- రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌కు ఘన సన్మానం



**ప్రజానావ, కరీంనగర్:** ఉద్యోగుల జీవితాంతం చేసిన సేవలకు గౌరవంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఆలస్యం చేయకుండా వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన రాగి శ్రీనివాస్, రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీగా ఎన్నికైన సర్దార్ హర్మీందర్ సింగ్‌లను కూడా ప్రత్యేకంగా సత్కరించారు. నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, నాయకులు ఎమ్.ఏ. హమీద్, సుద్దాల రాజయ్య గౌడ్, నాగేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, జావిద్ అలీ, పెండ్యాల కేశవరెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, సందీప్ రావు, సుమంత్ రావు, ఏవి రాజేశ్వరరావు, పోలు కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

## విప్ ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ:** ఆధ్యాత్మిక చింతన మనిషి జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, అది మానసిక ప్రశాంతతకు మూలాధారమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే వేములవాడ పట్టణ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ మహంకాళి, బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాలయాల్లో నిర్వహించే ఉత్సవాలు భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడులు, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ధ్యానం, భక్తి, ఆధ్యాత్మిక ఆలోచనలు మనసుకు నెమ్మదిని, ఆత్మకు ఆనందాన్ని అందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి భావనతో పాటు సామాజిక సమగ్రత కూడా బలపడుతుందని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# పొలం వద్ద నీళ్ల వివాదం

## కొడుకును హత్య చేసిన తండ్రి

## సోలాపూర్ జిల్లాలో కలకలం

## పోలీసుల అదుపులో నిందితుడు

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మాఢా తాలూకా రుయి గ్రామంలో పొలానికి నీళ్లు పెట్టే విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర స్థాయికి చేరడంతో, తండ్రే తన కుమారుడిని హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. అందిన సమాచారం ప్రకారం, వ్యవసాయ పనుల విషయమై తండ్రీ–కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా కుమారుడు తన తండ్రిని దూషించడంతో ఆగ్రహానికి గురైన నిందితుడు, రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తన కుమారుడిపై ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఈ దాడిలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కుటుంబ కలహాలు ఎంత ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీస్తాయో చెప్పే ఉదాహరణగా నిలిచింది. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడైన తండ్రి రాజేంద్ర పటాంగేపై టెంభుర్ణి పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సమృద్ధి హైవేపై ఘోర ప్రమాదం

## పికప్‌ను ఢీకొన్న ట్రక్కు

## ఏడుగురు మహిళా కార్మికులు మృతి

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని జల్నా జిల్లాలో సమృద్ధి హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు మహిళా కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 8 నుంచి 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. జల్నా జిల్లా కద్వాంచి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సమృద్ధి హైవేపై శుభ్రపరిచే పనులు చేస్తున్న కార్మికులను మహీంద్రా పికప్ వాహనంలో తీసుకువెళుతుండగా, అతివేగంతో వచ్చిన ట్రక్కు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో పికప్‌లో ఉన్న మహిళా కార్మికులు తీవ్రంగా గాయపడి, ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన వారిలో డ్రైవర్‌తో పాటు పలువురు మహిళా కార్మికులు ఉండగా, వారిని వెంటనే జల్నా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. మృతులంతా బద్నాపూర్ తాలూకాలోని కేలిగావన్, ఖడ్గావ్ ప్రాంతాలకు చెందిన వారని తెలిసింది. సమృద్ధి హైవే శుభ్రపరిచే పనుల కోసం ఏబీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ద్వారా సుమారు 15 మంది కార్మికులను నియమించగా, వారు ప్రతిరోజూ పనికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే జల్నా పోలీసులు, సమృద్ధి హైవే పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించి, ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# మీ కుమార్తెను ఒక రాత్రికి పంపించు

- లాకప్‌లో ఉన్న మహిళపై ఏఎస్ఐ అసభ్య ప్రవరర్తన
- సస్పెండ్ చేసిన అధికారులు.. పరారీలో నిందితుడు

**ప్రజానావ, ముంబై:** పోలీస్ లాకప్‌లో ఉన్న ఓ మహిళా నిందితురాలిపై డ్యూటీలో ఉన్న ఏఎస్ఐ అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు మహారాష్ట్రలోని అకోలా నగరంలో తీవ్ర కలకలం రేపాయి. డబ్బుకు బదులుగా తన 27 ఏళ్ల కుమార్తెను "ఒక రాత్రికి" పంపించాలని డిమాండ్ చేశాడన్న ఆరోపణలపై సంబంధిత ఏఎస్ఐ రాజేష్ జాదవ్‌ను అధికారులు తక్షణమే సస్పెండ్ చేశారు. అతనిపై అదే స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, ప్రస్తుతం పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. అందిన సమాచారం ప్రకారం, రూ.80 లక్షల ఆర్థిక మోసం కేసులో అరెస్టయిన ఓ మహిళను అకోలా సివిల్ పోలీస్ స్టేషన్ లాకప్‌లో ఉంచారు. ఈ సమయంలో డ్యూటీలో ఉన్న ఏఎస్ఐ రాజేష్ జాదవ్, 'మీ అమ్మాయి వయసెంత? రూ.10 వేలిస్తాను. ఒక్కరాత్రి నా దగ్గరకు పంపించు' అని డిమాండ్ చేసినట్లు బాధితురాలు ఆరోపించింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆర్థిక నేరాల విభాగం అధిపతి అనిల్ జుమాలే అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితురాలి వాంగ్మూలం విన్న అనంతరం, సదరు ఏఎస్ఐపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి అతడిపై చర్యలకు ఆదేశించారు.

ఇదిలా ఉండగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో ఏఎస్ఐ "నేను అలాంటి మాట అనలేదు, అనవసర ఆరోపణలు చేయొద్దు" అంటూ ఆరోపణలను ఖండిస్తున్నట్లు కనిపిస్తాడు. అక్కడే ఉన్న ఓ మహిళా పోలీస్ అధికారి కూడా "నా ముందు అలా అనలేదు" అని చెబుతున్న శబ్దం వినిపిస్తుంది. అదే సమయంలో, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు సదరు ఏఎస్ఐ ఆ మహిళపై ఫిర్యాదు చేస్తూ కనిపించడం గమనార్హం. మరో క్లిప్‌లో ఉన్నతాధికారి అతడిని మందలిస్తూ, "యూనిఫాం ధరించి ఇలాంటి పనులు చేయడానికి సిగ్గు లేదా?" అని ప్రశ్నించిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

## వేధింపుల కేసు నమోదు

లాకప్ వంటి సురక్షిత ప్రదేశంలో ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి రావడం పోలీస్ వ్యవస్థ ప్రతిష్టకు దెబ్బతీసిందని భావిస్తున్నారు. ఈ ఘటనపై సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో రాజేష్ జాదవ్‌పై వేధింపుల కేసు నమోదు చేశారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అర్చిత్ చందక్ అతనిని వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో, రాజేష్ జాదవ్ పోలీస్ స్టేషన్ వెనుక ద్వారం గుండా పరారైనట్లు సమాచారం. ఇక, ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ ఆశా మిరాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజేష్ జాదవ్‌పై గతంలో కూడా పలు ఆరోపణలు ఉన్నాయని, తన భార్య చేసిన ఫిర్యాదు కూడా పదేళ్ల క్రితమే తనకు అందిందని వెల్లడించారు. ఫిర్యాదులు నమోదు కాకపోవడం వల్లే అతను మరింత ధైర్యంగా వ్యవహరించాడని ఆమె ఆరోపించారు. అయితే, అకోలా పోలీసులు తీసుకున్న తక్షణ చర్యలను ఆమె అభినందించారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీస్ స్టేషన్లలో మహిళల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. లాకప్‌లలో మహిళా ఖైదీల రక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# సింగరేణిలో సిక్కం శ్యాంసుందర్ గానంకు నల్ల వజ్రం అవార్డు

**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యారణ్యపురి రోడ్ నెం.3కి చెందిన శ్యామ్ సుందర్ గానానికి, నటన ను గుర్తించి సంబంధించి ఎన్నో అవార్డులను రివార్డులను పొందిన సిక్కం శ్యాంసుందర్‌కు సింగరేణి కంపెనీ స్థాయి, కోలిండియా స్థాయిలో జరిగే సాంస్కృతిక పోటీలలో ఎన్నోమార్లు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆలిండియా రేడియోలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, ఆలిండియా రేడియో శ్రోతలు ఎన్నో ప్రశంసలను అందించారు. అక్షరజ్ఞానం, ఎయిడ్స్, పచ్చదనం పరిశుభ్రత లపై, కార్మిక కూడలిలలో వీధి నాటకాల ద్వారా కార్మికుల కుటుంబాలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి పలు కార్యక్రమాలను నిర్వహించారు. గత 38 ఏళ్లుగా సింగరేణి కంపెనీ నిర్వహించేలా కార్యక్రమాలను, సేఫ్టీ కార్యక్రమాలు, అక్షరజ్ఞానం, పచ్చదనం పరిశుభ్రత ఎయిడ్స్, గాలి నీరు ఈ కార్యక్రమాల మీద చాలా లఘు చిత్రాలను నిర్మించిన వాటిల్లో సిక్కం శ్యాంసుందర్ ప్రముఖ పాత్ర పోషించారు. మన బలగం షార్ట్ ఫిలింలలో తండ్రి పాత్రలో లీనమై అద్భుతంగా నటించారు. వారి గానానికి, నటనకు గుర్తింపుగా గోదావరిఖని తారా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు సంకె రాజేశ్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సిక్కం శ్యాంసుందర్‌ని పూలమాలతో శాలువాతో నల్ల వజ్రం అనే అవార్డుతో సన్మానించడం జరిగింది. ఈ అవార్డును అందుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డును ప్రదానం చేసిన సంక రాజేష్ ను ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# ఎన్పీడీసీఎల్ పర్యవేక్షణలో ' సెస్ ' సంస్థ పనిచేయడం హర్షనీయం

## నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

## మీడియా సమావేశంలో ప్రజా సంఘాల నాయకుడు పులి లక్ష్మీపతి

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల సహకారం విద్యుత్ సరఫరా సంస్థ సెస్ పర్యవేక్షణ బాధ్యతలను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి చేపట్టడం ప్రజా సంఘాల నాయకుడు పులి లక్ష్మీపతి హర్షనీయమన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎండీ వరుణ్ రెడ్డి బాధ్యతలు తీసుకోవడం చాలా శుభసూచకమన్నారు. సెస్ పై వస్తున్న ఆరోపణలపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్పీడీసీఎల్ సీఎండీకి బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్పీడీసీఎల్ జీతాలతో, నిబంధనలతో నడుస్తున్నదని, సెస్ ను పూర్తిస్థాయిలో స్వాధీనపరచుకొని, స్వచ్ఛమైన పాలనపరమైన సేవలు, నాణ్యమైన కరెంటు అందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పులి లక్ష్మీపతి గౌడ్, సంపత్ రావు భారతీయ కిసాన్ సంగ్ అధికార ప్రతినిధి, బియంకర్ శ్రీనివాస్ భారతీయ కిసాన్ సంగ్ జిల్లా కార్యదర్శి, చిప్ప దేవదాస్, కుసుమ గణేష్ భారతీయ కిసాన్ సం సభ్యులు పాల్గొన్నారు.



# ఐడీఓసీలో డీఎల్టీసీ సమావేశం

## అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల:** డిస్ట్రిక్ట్ లెవెల్ టెలికాం కమిటీ (డీఎల్టీసీ) సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్), రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్, టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా, భారత్ నెట్ ఇన్‌ఫ్రా, కాల్ బీ ఫోర్ యూ డీజీ మొబైల్ అప్లికేషన్ తదితర అంశాలపై సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్న సందర్భంగా ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా టీఫైబర్, బీఎస్ఎన్ఎల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, టీ ఫైబర్, బీఎస్ఎన్ఎల్ అధికారులు, మిషన్ భగీరథ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

